యూరియా కొరత.. రైతుల వెత

- కర్షకులను పట్టిపీడిస్తున్న యూరియా కష్టాలు
- పీఏసీఎస్, జీడీసీఎంఎస్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్న రైతులు
- ఒక్క కట్ట యూరియా పంపిణీపై రైతుల ఆగ్రహం


పెదపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం దగ్గర క్యూలో మహిళలు

వేమూరు: ఖరీఫ్ సీజన్‌లో పంటలు పండించేందుకు రైతులు యూరియా ఉపయోగిస్తారు. యూరియా టీడీపీ నాయకుల చేతికి వెళ్లడంతో కొరత నెలకొంది. దీంతో రైతులు యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో యూరియా కోసం రైతులు రోడ్లెక్కుతున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద యూరియా కోసం గంటల తరబడి క్యూలో నిలబడుతున్నా దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాయకులు సంపాదనపై పడ్డారు. మద్యం షాపుల ద్వారా ప్రతి గ్రామంలో కూటమి నాయకులు బెల్టు షాపులు కొనసాగిస్తున్నారు. రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్నారు. ఎక్కువ ధరకు యూరియా అమ్ముకునేందుకు నిల్వ చేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకు యూరియా అందించాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు కేటాయించింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు అధిక రేట్లకు అమ్ముతున్నారని, సహకార సంఘాలపై వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపించిందని రైతులు అంటున్నారు.

రైతులను పట్టిపీడిస్తున్న యూరియా కొరత

కొల్లూరు: పట్టిపీడిస్తున్న యూరియా కొరత కారణంగా కర్షకులు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వ వైఫల్యం రైతుల పాలిట శాపంగా మారింది. పీఏసీఎస్, జీడీసీఎంఎస్, రైతు సేవా కేంద్రాలకు ఆయకట్టుకు సరిపడా యూరియా సరఫరా అవని కారణంగా రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. పీఏసీఎస్‌లకు వచ్చిన యూరియా సైతం రాజకీయ నాయకుల సిఫార్సుల కారణంగా రాత్రికి రాత్రి పక్కదారి పడుతుండటంతో రైతులు, కౌలు రైతులుకు దక్కకుండా పోతుండటంతో తీవ్ర ఎద్దడి ఏర్పడుతుంది. సోమవారం మండలంలోని క్రాప, ఈపూరు, దోనేపూడి పీఏసీఎస్ కేంద్రాలకు 19.80 మెట్రిక్ టన్నుల చొప్పున, కొల్లూరు జీడీసీఎంఎస్ కేంద్రంలో 9.90 మెట్రిక్ టన్నుల యూరియాను వ్యవసాయ శాఖ, రెవెన్యూ, పోలీసు, సంబంధిత సిబ్బంది రైతులకు పంపిణీ చేశారు. అయితే ఈపూరు పీఏసీఎస్‌లో సాగు విస్తీర్ణాన్ని బట్టి 2 నుంచి 5 బస్తాల యూరియా పంపిణీ చేశారు. క్రాప పీఏసీఎస్‌లో ఒక్కో రైతుకు ఒక్కో బస్తా మాత్రమే అందజేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా అందుబాటులో ఉందన్న సమాచారంతో రైతులు అధిక సంఖ్యలో తరలి రావడంతో పంపిణీ కేంద్రాల వద్ద రైతులు బారులు తీరి నిరీక్షించారు. రైతులు కోసం అధికారులు టెంట్‌లు, కుర్చీలు, మంచినీటి సౌకర్యం కల్పించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది



కూటమి ప్రభుత్వంలో యూరియా పంపిణీ వ్యవహారం నాయకుల చేతికి వెళ్లింది. దీంతో చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు యూరియా కోసం నానా అవస్థలు పడుతున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా వచ్చిన యూరియా రైతులకు అందడం లేదు. యూరియా ఎక్కడికి వెళుతుంది అర్థం కావడం లేదు. యూరియా అవకతవకలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది.

– కోగంటి సురేష్, జంపని

అరకొరగా యూరియా పంపిణీ



వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అరకొరగా యూరియా పంపిణీ చేస్తున్నారు. ప్రాథమి వ్యవసాయ సహకార సంఘాలు ద్వారా రైతులకు యూరియా ఇస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో యూరియా రైతులకు అందడం లేదు.

– గోపాలం శ్రీనివాసరావు, చావలి, వేమూరు మండలం

యూరియా అవకతవకలపై ఫిర్యాదు

- వేమూరు మార్కెట్‌యార్డులో డీసీఎంఎస్ ద్వారా రైతులకు యూరియా అందిస్తున్నారు. రెండు రోజులు క్రితం వేమూరు మార్కెట్‌యార్డులో వేమూరుకు చెందిన టీడీపీ నాయకుడు 400 బస్తాలు టోకెనులు రాయించారు. దీనిపై చావలి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త డీసీఎంఎస్ అధికారులను నిలదీశారు. దీంతో టీడీపీ నాయకులు మధ్య గొడవ నెలకొంది.
- కొల్లూరు మండలంలోని గాజులంక ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం వద్ద రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. ఆదివారం భట్టిప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం వద్ద రైతులు క్యూలో ఉన్నారు.
- అమర్తలూరు మండలంలో పాంచాళవరం, ప్యాపర్రు గ్రామాల్లో యూరియా బస్తాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. పెదపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా కోసం మహిళలు క్యూలో ఉన్నారు. టీడీపీ నాయకుల సమక్షంలో యూరియా పంపిణీ చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు యూరియా పంపిణీలో నామమాత్రంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- వేమూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జంపని గ్రామానికి యూరియా అందడం లేదని గ్రామానికి చెందిన వ్యక్తి బాపట్ల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు రద్దు చేసుకోవాలని టీడీపీ నాయకులు భయభ్రాంతులకు గురి చేయడం జరిగిందని ఆయన ఆరోపించారు.


కొల్లూరు మండలం క్రాప పీఏసీఎస్ వద్ద బారులు తీరిన రైతులు


కొల్లూరు మండలం ఈపూరు పీఏసీఎస్‌లో యూరియా స్లిప్‌ల కోసం బారులు తీరిన రైతులు


కొల్లూరు మండలం రావికంపాడు యూరియా పంపిణీ కేంద్రం వద్ద రైతులు


కొల్లూరు మండలం క్రాప పీఏసీఎస్ వద్ద వేచి ఉన్న రైతులు

'అన్నదాత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పడమటి శ్రీనివాసరావు

భట్టిప్రోలు: ఎరువులు బ్లాక్ మార్కెట్ దందాపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు రైతులకు అండగా చేపట్టిన 'అన్నదాత పోరు' కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు మంగళవారం రేపల్లెలో ఆర్డీవోకు వినతిపత్రం అందించనున్నట్లు భట్టిప్రోలు మండల కన్వీనర్ పడమటి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశోక్‌బాబు ఆధ్వర్యంలో రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఉదయం 9 గంటలకు భట్టిప్రోలు మండలం వేమవరం అడ్డ రోడ్డు నుంచి పల్లెకోన మీదుగా రేపల్లె వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేమూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ పదవుల్లోని నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అలాగే రైతు సోదరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు 'అన్నదాత పోరు' కు తరలిరావాలి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు శివరామకృష్ణా రెడ్డి

చుండూరు(వేమూరు): రేపల్లె రెవెన్యూ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమం విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు గాదె శివరామకృష్ణా రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు రైతులకు అండగా నిర్వహిస్తున్న అన్నదాత పోరు కార్యక్రమానికి చుండూరు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తరలిరావాలని ఆయన తెలిపారు. భట్టిప్రోలు మండలం వేమవరం అడ్డ రోడ్డు నుంచి వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు నాయకత్వంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని రైతులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు



రేపల్లె: ప్రజా సయస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆర్డీవో నేలవ రామలక్ష్మి అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల సమస్యలపై వచ్చిన అర్జీలను ఆమె స్వీకరించి మాట్లాడారు. భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామానికి చెందిన వీరరాఘవయ్య తనకు రావాల్సిన పెన్షన్ల బకాయిలు మంజూరు చేయాలని ఒక అర్జీ, రేపల్లె మున్సిపాలిటీ నుంచి సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయాలని మరో అర్జీ, దోనేపూడి గ్రామానికి చెందిన సత్యన్నారాయణ ఇంటికి ఇంటి పన్ను నమోదు చెయ్యాలని కోరుతూ అర్జీ, భట్టిప్రోలు చెన్నకేశవస్వామి దేవస్థానం కింద ఉన్న 11 షాపులను లీజు ప్రకారం కేటాయించాలని మరో అర్జీ అందాయని తెలిపారు. వచ్చిన నాలుగు అర్జీలను ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కరించనున్నట్టు ఆమె తెలిపారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి చేయూత



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందిన నాగమల్లేశ్వరరావు పూరిల్లు ఇటీవల అగ్ని ప్రమాదానికి దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వ్యాపారవేత్త వేములపల్లి రవికిరణ్ మిత్ర బృందం ఆయన కుటుంబానికి సోమవారం రూ.5 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొజ్జా రవి, వెల్లటూరు గ్రామ వాసులు తటవర్తి సోమశేఖర్, పోతార్లంక రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భాగవత సప్తాహ ప్రవచనాలు



కొల్లూరు: భాగవత సప్తావ 109వ జ్ఞానయజ్ఞ ప్రవచనాలు సోమవారంతో ముగిసినట్లు శంకర సేవా సమితి నిర్వాహకులు పేర్కొన్నారు. కొల్లూరు శ్రీపార్వతీ సంస్కృత పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న ప్రవచన కార్యక్రమంలో పాల్గొన్న ప్రవచకులు తంగిరాల రాజేంద్రప్రసాద్, పాఠకులు మల్లాది శివరామకృష్ణ మూర్తిలను ఈ సందర్భంగా డాక్టర్ భాగవతుల సూర్యానారాయణమూర్తి ఘనంగా సత్కరించారు. తొలుత ముగింపు కార్యక్రమాలలో భాగంగా విష్ణు సహస్రనామ పారాయణ, పుట్నాల అవభృత స్నానం నిర్వహించారు. అనంతరం వేద పాఠశాల గురువులు, విద్యార్థులను సన్మానించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పాఠశాలల స్వీపర్ల జీతాల బకాయిలు విడుదల చేయాలి



బాపట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు జీతాల బకాయిలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళికి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం వినతిపత్రం అందించారు. నాలుగు నెలల జీతాలు బకాయిలు ఉండటం వలన స్వీపర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కె.శరత్, నల్లమోతు చిన్ని, కార్మికులు నాగలక్ష్మి, సుబ్బారావమ్మ, లిధియా తదితరులు ఉన్నారు.

ఫార్మసిస్ట్, ఏఎన్ఎంలకు సన్మానం



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంకు చెందిన ఫార్మసిస్ట్ శివకుమారి, ఏఎన్ఎంలు శివకుమారి, టి.లక్ష్మి దుర్గలు ఉత్తమ పనితీరు కనబరిచినందుకు గాను ఇటీవల బాపట్ల జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. సోమవారం స్థానిక వెల్లటూరు పీహెచ్‌సీలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరిలు వారిని అభినందించి ఘనంగా సన్మానించారు. సేవా దృక్పథంతో మెరుగైన సేవలను అందించి ప్రజల మన్ననలను పొందాలని వారు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జి.అబ్రహం లింకన్, ఎల్.పవన్ చైతన్య, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంది

తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎస్ఐ శివయ్య


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, పక్కన ఎస్ఐ శివయ్య తదితరులు

భట్టిప్రోలు: రైతులకు అవసరమైన యూరియా పుష్కలంగా అందుబాటులో ఉందని అధైర్య పడవద్దని భట్టిప్రోలు తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది మండలంలోని గ్రామాలకు యూరియా అదనంగా సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇప్పటికే మండలానికి తొలి, మలి విడతలలో యూరియా సరఫరా చేయడం జరిగిందన్నారు. రైతులు యూరియా కొరత ఉందన్న ప్రచారంతో అవసరం లేకపోయినప్పటికీ ఎక్కువ మొత్తంలో సేకరించి నిల్వ చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మండల వ్యాప్తంగా 16 వేల ఎకరాలు సాగు భూమి ఉండగా ఇప్పటి వరకు 34,800 బస్తాల యూరియా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. 3వ విడత కోసం యూరియాను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ప్రైవేట్ దుకాణాలలో కూడా యూరియాను ఎమ్మార్పీ ధరకే విక్రయించాలన్న నిబంధన విధించినట్లు చెప్పారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్‌ల సహకారంతో యూరియా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో బి.బ్రహ్మారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఎ.శాంత లక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో ఈపూరు విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు పెంచాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, గ్రీన్ అంబాసిడర్లు

కొల్లూరు: పారిశుద్ధ్య పనులలో కీలకపాత్ర పోషిస్తున్న గ్రీన్ అంబాసిడర్ల వేతనాలను ప్రభుత్వ జీఓ ప్రకారం తక్షణం పెంచాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు, గ్రీన్ అంబాసిడర్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. సోమవారం కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటీలలో చెల్లిస్తున్న విధంగా పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రూ.21 వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. గ్రీన్ అంబాసిడర్లకు రూ.10 వేలు వేతనం చెల్లించాలని ప్రభుత్వం జీఓ విడుదల చేసినప్పటికీ వారికి రూ.6 వేలు మాత్రమే చెల్లించడం దారుణమన్నారు. ప్రభుత్వ జీఓను తక్షణం అమలు చేయాలని కోరారు. వేతనాలు పెంపుతోపాటు, దుస్తులు, కొబ్బరినూనె, చెప్పులు, బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.సుబ్బారావు, పి.నాగమల్లేశ్వరరావు, గ్రీన్ అంబాసిడర్లు పాముల భాస్కరరావు, చొప్పర కోటేశ్వరరావు, కనసర్తి సుధాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అమలు చేయాలి

- ఏపీ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి సత్యన్నారాయణ
- భట్టిప్రోలులో చేనేత కార్మికులు ధర్నా, వినతి


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు, సభ్యులు

భట్టిప్రోలు: చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యన్నారాయణ డిమాండ్ చేశారు. గత ఏడాది జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జరిగిన సదస్సులో సీఎం చంద్రబాబు చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో సోమవారం భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యన్నారాయణ మాట్లాడుతూ నూలు రంగులు రసాయనాలపై, జీఎస్టీని వెంటనే ఎత్తివేస్తామని అలా కుదరని పక్షంలో రీయింబర్స్‌మెంట్ ఇస్తామని సీఎం హామీ ఇచ్చినా నేటి వరకు అమలుకు నోచుకోలేదని అన్నారు. చేనేత కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్ ప్రభుత్వ కంట్రిబ్యూషన్ కింద రూ.5 కోట్లు గత ఏడాది కేటాయించినా విడుదల చేయలేదని పేర్కొన్నారు. సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రూ.1,506 కోట్లు వెంటనే విడుదల చేస్తామని హామీ ఇచ్చినా ఇంత వరకు అమలుకు నోచుకోలేదని తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 7న చేనేత కార్మికులకు రూ.25 వేలు ఆర్థిక సహాయం ప్రకటించిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ మేకా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దీపాల సత్యన్నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు బి.నాగమల్లేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, జి.కోటేశ్వరరావు, ఎస్.గోపాలస్వామి, కౌలు రైతు, సీఐటీయూ నాయకులు జి.నాగరాజు, పి.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై తప్పిన పెను ప్రమాదం



చెరుకుపల్లి: జాతీయ రహదారిపై వెళుతున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న దుకాణాన్ని ఢీ కొన్న ఘటన మండలంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం భట్టిప్రోలు వైపు నుంచి చెరుకుపల్లి వైపుకు వస్తున్న స్కార్పియో వాహనం మండల పరిధిలోని నడింపల్లి గ్రామం చర్చి సమీపంలో ఎదురుగా వస్తున్న చెరుకుపల్లి వైపు నుంచి భట్టిప్రోలు వైపు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రెండు సిమెంటు బల్లలను ఢీ కొని పక్కనే ఉన్న దుకాణాన్ని ఢీ కొట్టిందని తెలిపారు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో రోడ్డు పక్కన దుకాణ సముదాయం వద్ద ఎవరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు చెప్పారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటనపై తెనాలి జీఆర్పీ ఇన్‌చార్జి ఎస్ఐ ఎల్. సరస్వతి కేసు నమోదు చేశారు. ఆమె వెల్లడించిన వివరాల ప్రకారం సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తెనాలి–బాపట్ల రైలు మార్గంలో నిడుబ్రోలు స్టేషనన్ సీపంలో ఉన్నట్లు అందిన సమాచారంతో ఘటన స్థలాన్ని జీఆర్పీ సిబ్బంది పరిశీలించారు. సుమారు 40 సంవత్సరాల వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లుగా భావిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గ్రహణానంతరం తెరుచుకున్న ఆలయాలు


కనకదుర్గ అమ్మవారి దేవస్థానం


రామ చౌడేశ్వరస్వామి దేవస్థానం

చుండూరు(వేమూరు): సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం పలు ఆలయాలు తలుపులు మూసి వేశారు. వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండలం మోదుకూరు గ్రామంలో కనకదుర్గ అమ్మవారి దేవస్థానం, రామచౌడేశ్వరస్వామి దేవస్థానం మూసివేశారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున తలుపులు తెరిచి ఆలయాలను శుద్ధి చేసి అనంతరం యథాతథంగా పూజలు నిర్వహించారు. పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో గుండి పార్వతికి పూజలు

భట్టిప్రోలు: చంద్ర గ్రహణం సందర్భంగా ఆదివారం రాత్రి భట్టిప్రోలు హిందూ శ్మశాన వాటికలో కొలువైన గుండి పార్వతి అమ్మవారి దేవాలయాన్ని మూసివేశారు. ఈ సందర్భంగా అర్చకులు భట్టిప్రోలు కార్తికేయ శర్మ దర్భలను దేవాలయం, హోమ గుండం, పులి వాహనంపై పరిసర ప్రాంతాలలో ఉంచారు. సోమవారం ఉదయం అమ్మవారి దేవాలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం అభిషేకాలు, పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

విద్యుత్ చౌర్యం.. చర్యలు శూన్యం


బలిజేపల్లి గ్రామంలో మోటార్లకు విద్యుత్ వినియోగం

వేమూరు: వ్యవసాయ విద్యుత్ మోటార్లకు దొంగతనంగా కరెంట్ ఉపయోగిస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. వేమూరు మండలంలోని బలిజేపల్లి గ్రామంలో వ్యవసాయ విద్యుత్ మోటార్లకు దొంగతనంగా కరెంట్ ఉపయోగిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వారిపై చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ చౌర్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు రోజారమణికి సన్మానం



భట్టిప్రోలు: మండలంలోని వెల్లటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎల్‌ఈ) ప్రధానోపాధ్యాయురాలు ఓలేటి రోజారమణిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న సందర్భంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు సన్మానించారు. ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉదయభాస్కరి, ఎంఈవోలు పులి లాజర్, దేవరాజ్, డిప్యూటీ ఎంపీడీవో విజయబాబు, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అరుణకుమారి, పెసర్లంక పాఠశాల హెచ్‌ఎం సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యా శాఖ అధికారులకు సన్మానం

చుండూరు(వేమూరు): మండల విద్యా శాఖాధికారుల సేవలు మరువలేమని ఫ్యాప్టో నాయకులు తెలిపారు. చుండూరు మండలంలో ఎంఈవోగా పని చేసి బదిలీపై వెళ్లిన చలపతిరావు, ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన సుదేష్‌బాబు, ఎంఈఓ–2 సలోమాన్‌లకు సోమవారం సన్మానం చేశారు. ఎంఈవోలు ఉపాధ్యాయులకు సేవలు అందించారని తెలిపారు. మండల ఫ్యాప్టో నాయకులు బి.ఏడుకొండలు, ఎస్‌కే జిలానీ, హరిపూర్ణ ప్రసాద్, బాలసుబ్రమణ్యం, రఫీఉల్లా, వినోద్‌కుమార్, రమేష్‌బాబు, కె.నాగేశ్వర ప్రసాద్, బీవీ సుబ్బారావు, సీతారామయ్య పాల్గొన్నారు.



వాహనం దహనం చేసిన నిందితుల అరెస్టు

కొల్లూరు: అర్ధరాత్రి సమయంలో ఆటోను దగ్ధం చేసిన నిందితులను కొల్లూరు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొల్లూరుకు చెందిన టీడీపీ నాయకుడు బుర్రి జగజ్జీవన్‌రావు తాను నడుపుతున్న వాటర్ ప్లాంట్ ఎదురుగా టాటా ఏస్ వాహనాన్ని నిలిపి ఉంచాడు. ఈ నెల 3వ తేదీ తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు వాహనంపై పెట్రోలు చల్లి దహనం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు జగజ్జీవన్‌రావుతో ఉన్న మనస్పర్థల కారణంగా కొల్లూరు ఎస్సీ ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు వాహనాన్ని దగ్ధం చేసినట్లు గుర్తించారు. గతంలో జగజ్జీవన్‌రావుకు బిక్షాలుకు ఓ విగ్రహం విషయంలో, మరో ఇరువురు వ్యక్తులతో చిన్న చిన్న గొడవలు ఉన్నాయి. ఈ కారణంగానే కొక్కిలిగడ్డ అశోక్ (గుండు), గొరికపూడి బాబు (బుల్లిబాబు), చొప్పర బిక్షాలు ఆటోను దగ్ధం చేసినట్లు వెల్లడించారు. నిందితులను అదుపులోకి తీసుకొని సోమవారం తెనాలి కోర్టుకు హాజరుపర్చగా, న్యాయమూర్తి వ్యక్తిగత పూచీకత్తుతో స్టేషన్ బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు. అంతర్గత విభేదాలతో బాధితుడు జగజ్జీవన్‌రావు టీడీపీలో కొనసాగుతున్న వర్గానికే చెందిన టీడీపీ వ్యక్తులే వాహనాన్ని దగ్ధం చేయడం కొసమెరుపు.